## క్లుప్తంగా

### అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి

**గోకవరం:** మండలంలోని కృష్ణునిపాలెంలో అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు చేయూతనందించారు. స్థానిక శాగో ఫ్యాక్టరీకి వెళ్లే మార్గంలో కండేపల్లి వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకు ఇంటి నుంచి ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. రంపచోడవరం నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్ మంటలను అదుపు చేసింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు జ్యోతుల రామస్వామి, స్థానిక నాయకులతో కలిసి బాధితులను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధితులకు రూ.10 వేల నగదు, బియ్యం బస్తా, కూరగాయలు, వంట సామగ్రి, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, రౌతు జోగేశ్వరరావు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, అంబటి ప్రసన్న, బిజ్జి రాజు, మచ్చా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### తాటాకిల్లు దగ్ధం



ఏలేశ్వరంలో దగ్ధమైన తాటాకిల్లు

**ఏలేశ్వరం:** స్థానిక ఏలేరు ప్రాజెక్టు సమీపంలోని దిబ్బల్లో ఆదివారం తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. ఒడిశాకు చెందిన కబాసీ ఎర్మా 20 ఏళ్లుగా దిబ్బల్లో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం కూలి పనులకు వెళ్లిపోయారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

### విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు



భగవద్గీత శ్లోకం ఆలపిస్తున్న విద్యార్థి

**తుని:** స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంగం యువజనోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. తుని పట్టణం, రూరల్ పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి, రోటరీ ప్రతినిధులు ప్రసాద్, సుబ్బరాయులు, మంగరాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**కిర్లంపూడి:** కాకినాడకు చెందిన సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ×కొడితే కొట్టాలిె పేరుతో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. స్థానిక కొక్కొండ శేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాల క్రీడా ప్రాంగాణంలో క్రికెట్ పోటీలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో ఉపాధ్యక్షుడు చదలవాడ బాబీ ప్రారంభించారు. గ్రామ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సానా సతీష్‌బాబు ఫౌండేషన్‌ను ఆయన అభినందించారు. ఈ టోర్నీలో ఐదు జట్లు పాల్గొంటున్నాయని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. విన్నర్ జట్టుకు రూ.15 వేలు, రన్నర్ జట్టుకు రూ.8 వేలు, మెన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన వ్యక్తికి రూ.వెయ్యి నగదును ట్రస్టు తరఫున అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాపేటి ప్రసాద్, సిగాటపు కృష్ణారావు, పాముల వీరబాబు, శరకణం సూరిబాబు, కాళ్ల పోలారావు, పులిబంటి దుర్గ, కరణం లోవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



టాస్ వేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చదలవాడ బాబీ

# ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



బెండపూడిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- బెండపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

**తొండంగి:** రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని బెండపూడిలో ఆదివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తొలుత అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎస్సీ పేటలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వాటిని తక్షణమే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. తమ ప్రభుత్వంలో కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణచౌదరి (పెద్దబ్బు), వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, ఎంపీడీఓ పసపులేటి సతీష్, సర్పంచ్ ఏలేటి దుర్గాదేవి, పార్టీ నాయకులు ఏలేటి ధర్మరాజు, మద్దుకూరి వెంకటరామయ్యచౌదరి, గొంతెన నాగేశ్వరరావు, మళ్ల సురేష్, బూసాల గణపతి తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుని గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు
- లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా

**అన్నవరం:** కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం నిర్వహించే సత్యదేవుని గిరిప్రదక్షిణకు సర్వం సిద్ధమైంది. ఉదయం 7.30 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని పల్లకీ మీద కొండదిగువన తొలిపాంచా వద్దకు తీసుకువస్తారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ కొబ్బరికాయ కొట్టి సత్యదేవుని గిరిప్రదక్షిణను ప్రారంభిస్తారు. అన్నవరం మెయిన్ రోడ్డు, జాతీయరహదారి మీదుగా బెండపూడి పుష్కర కాలువ నుంచి రత్నగిరి, సత్యగిరుల మీదుగా గిరిప్రదక్షిణ తిరిగి సత్యదేవుని ఆలయానికి చేరుతుంది. సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ సాగుతుంది. గిరిప్రదక్షిణలో లక్ష మంది భక్తులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

### భక్తులకు పాలు, పండ్ల పంపిణీ

గిరిప్రదక్షిణ మార్గంలో పది చోట్ల రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అభిమానులు భక్తులకు పాలు, పండ్లు, ఫలహారం, బిస్కెట్లు పంపిణీ చేయడానికి స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో మరో ఐదు చోట్ల మంచినీరు, పండ్లు, పాలు పంపిణీకి ఏర్పాట్లు చేశారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు పులిహోర పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.



చదును చేయించిన గిరిప్రదక్షిణ మార్గం



మహిళల కోసం ఏర్పాటు చేసిన బయో టాయిలెట్స్



గిరిప్రదక్షిణ రోడ్డులో పనులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు తదితరులు

### పనుల పరిశీలన

గిరిప్రదక్షిణ మార్గంలో భక్తుల కాళ్లకు చిన్న చిన్న గులకరాళ్లు గుచ్చుకోకుండా జేసీబీతో చదును చేయించారు. రాళ్లు ఎక్కువగా ఉన్నచోట గడ్డి వేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మార్గం మధ్యలో మహిళలకు బయో టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. గిరి ప్రదక్షిణ రోడ్డు పనులను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, ఈఈ నర్సింహరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు పేరూరి బదిరీ నారాయణ ఆదివారం పరిశీలించారు.

# భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి వేడుకలు

- కిటకిటలాడిన శివాలయాలు
- అలరించిన జ్వాలాతోరణం

**ఏలేశ్వరం:** నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం కార్తికపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు ఇళ్ల వద్ద కేదారీశ్వరాస్వామికి ప్రత్యేకపూజలు చేశారు. ఏలేశ్వరం శివాలయంలో అర్చకులు శేఖర్, మహేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పాలాడ కుటుంబీకుల ఆధ్వర్యంలో జ్వాలాతోరణం నిర్వహించారు. అనంతరం శివాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. లింగంపర్తి, సిరిపురం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

**కిటకిటలాడిన శివాలయాలు**

**తొండంగి:** కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని గోపాలపట్నం ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద జ్వాలాతోరణం చేశారు.



ఏలేశ్వరం శివాలయంలో ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అర్చకులు శివపార్వతుల విగ్రహాలను పల్లకీపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. తొండంగి రామలింగేశ్వరాలయం, ఒంటిమామిడి విశ్వేశ్వరాలయం, శృంగవృక్షం సోమేశ్వరాలయం, పి.ఇ.చిన్నాయపాలెం, పైడికొండ, అద్దరిపేట, పంపాదిపేట గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు కార్తిక దీపారాధన చేశారు.

**గండేపల్లి:** కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో పలువురు మహిళలు అఖండ జ్యోతులు వెలిగించారు.



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, జ్వాలా తోరణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు రామానందస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**ప్రత్తిపాడు రూరల్:** మండలవ్యాప్తంగా కార్తిక పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. రాచపల్లిలోని అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయం, ఒమ్మంగి ఉమారామలింగేశ్వరస్వామి, శాంతిఆశ్రమంలోని విశ్వనాథుని ఆలయం, గజ్జనపూడి రామలింగేశ్వరస్వామి, ధర్మవరం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని ధరపల్లి, ఎరకంపాలెం జలపాతాలకు భక్తులు భారీగా తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయాల్లోని ధ్వజ స్తంభాల వద్ద మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు.



అరుణాచల క్షేత్రంలో జ్వాలా తోరణం

### ముగిసిన గౌరీశంకరుల ఉత్సవాలు



కత్తిపోటు వేషం వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా పగటి పూట వేసే వీధినాటకాలకు సమాప్తం పలికారు. చివరిరోజు కత్తిపోటు వేషం వీధినాటకాన్ని స్థానిక కళాకారులు ప్రదర్శించారు. గౌరీదేవి ఆచూకీ కోసం శివుడు కత్తిపోటు వేషం వేసుకొను గ్రామంలో సంచరించడం అనే ఇతివృత్తంతో సాగిన నాటకం ఆద్యంతం భక్తులను అలరించింది. నాటకంలో బందిపోటు దొంగలుగా మేడిబోయిన సూరిబాబు, గోందాల శివ, రాజులుగా కోనేటి సత్తిబాబు, ఎరికిరెడ్డి బుజ్జి, బందిపోటు భార్యలుగా ఎన్.సత్తిబాబు, పక్కుర్తి పుష్ప నటించి మెప్పించారు. తొలుత గ్రామ వీధుల్లో సాంబశివుడిని ఊరేగించారు.

# భక్తులకు అయోధ్య రామాలయం అక్షతలు

**ఏలేశ్వరం:** మండలంలోని భక్తులకు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య రామాలయం అక్షతలను పంపిణీ చేయనున్నట్టు ధర్మాచార్య ప్రముఖ్ తోట వీరమహేశ్వరరావు తెలిపారు. అయోధ్య అక్షింతలను ఆదివారం స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భక్తులకు పంచేందుకు గాను అయోధ్య నుంచి అక్షతలను తీసుకువచ్చామన్నారు. వీటిని మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పంపిణీ చేస్తామన్నారు. తొలుత స్థానిక పాత బస్టాండ్ వినాయకుని ఆలయం నుంచి ఊరేగింపుగా సత్యనారాయణస్వామి ఆలయానికి అక్షతలను తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ఏడీవీ ప్రసాద్, పాబోలు దేవి, రేవతి, మజ్జి సత్యనారాయణ, వీరబాబు, అలమండ పెదచలమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో సత్యనారాయణ స్వామి ఆలయానికి అయోధ్య అక్షతలను తీసుకువచ్చిన వీహెచ్‌పీ సభ్యులు

**గోకవరం చేరిన అయోధ్య రాముని అక్షతలు**

**గోకవరం:** స్థానిక దాసరి వారి రామాలయానికి అయోధ్య నుంచి శ్రీరాముని పవిత్ర అక్షతలు చేరుకున్నాయి. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ నుంచి పంపిన ఈ అక్షింతలను విశ్వహిందూ పరిషత్ రాజమహేంద్రవరం జల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు, కొత్తపల్లి సత్యన్నారాయణ కలశంలో పెట్టుకుని ఆదివారం ఆలయానికి తీసుకువచ్చారు. ఈ అక్షతలకు స్థానికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదివిష్ణు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని డిసెంబర్ 8 నుంచి ప్రతి గ్రామానికి ఈ అక్షింతలు, కరపత్రాలు, శ్రీరాముని చిత్రపటం పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో దాసరి ధర్మరాజు, ఇనకోటి బాపన్నదొర, తుమ్మల చిన్నబ్బు, సిద్ధ వాసు, మహిపాల దుర్గారావులు పాల్గొన్నారు.

### నేడు సుదర్శన హోమం

**తుని రూరల్:** ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సుదర్శన హోమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే హోమ క్రతువులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

**29న పాదయాత్ర**

ఈ నెల 29న ఎస్.అన్నవరంలో రామ సాయి మందిరం నుంచి సాయి శివ భక్తులు పాయకరావుపేట మండలం సీతమ్మవారి కొండ వరకూ పాదయాత్ర చేస్తారని మందిరం ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఆ రోజు ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే పాదయాత్రలో భక్తులు పాల్గొని సాయినాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కాకినాడలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

**కిర్లంపూడి:** క్రియ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీల్లో తామరాడ జేడ్పీ ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 3వ స్థానంలో నిలిచినట్టు పాఠశాల హెచ్‌ఎం ఎల్.కృష్ణ తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో ఈ నెల 25, 26 తేదీల్లో క్రియా రాష్ట్ర స్థాయి బాలల పండగ జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక లఘు నాటికల్లో సీనియర్స్ విభాగం నుంచి 'కంటే కూతుర్నే కనాలి', జూనియర్స్ విభాగం నుంచి మూఢ నమ్మకాలు–అభివృద్ధి నిరోధకాలు, 'ఝాన్సీలక్ష్మీబాయి' వంటి సాంస్కృతిక నాటకాలతో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

### ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా

**సామర్లకోట:** కెనాల్ రోడ్డులో మాండవ్య నారాయణస్వామి ఆలయం వద్ద ఆదివారం ధాన్యం లోడ్ ట్రాక్టరు బోల్తా పడింది. వేట్లపాలెం నుంచి చంద్రంపాలెం వెళుతున్న ధాన్యం లోడ్ ట్రాక్టరు.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే సమయంలో అదుపుతప్పింది. వాహనం బోల్తా పడే క్రమంలో ట్రాక్టరు డ్రైవరు చాకచక్యంగా తప్పించుకున్నాడు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం తమ సిబ్బందితో క్రమబద్ధీకరించారు.

# స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్



తూర్పులక్ష్మీపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



శంఖవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



కోటనందూరులో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

**శంఖవరం:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం శంఖవరంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, వజ్రకూటం సర్పంచ్ సకురు గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

**తుని:** స్థానిక భాష్యం విద్యాసంస్థల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు శివరామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జి. రాము తదితరులు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు కుమార్, మణికంఠ, సాయి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఏలేశ్వరం:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లింగంపర్తి, జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం, భద్రవరం గ్రామాల్లోని రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించవల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అంబేడ్కర్ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, యార్లగడ్డ రాజాచౌదరి, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తుని రూరల్:** స్ఫూర్తిప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాజమహేంద్రవరం ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ డీఈఈ జీవీ రామకృష్ణారావు అన్నారు. మండలంలోని హంసవరంలో ఆదివారం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జెండాను ఎగురవేశారు. మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ మాసా రాందాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**కోటనందూరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, ఉల్లూరి శ్రీను, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**రౌతులపూడి:** గ్రామంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బద్రే రాజేశ్వరరావు, గంటా సత్యనారాయణ, యాదగిరి సత్యప్రకాష్, గంటా భాస్కర్, కంచెర్ల రాజు, మాసా సూకరాజు తదితరులు పాల్గొన్నారు.

**రాజ్యాంగ స్ఫూర్తితోనే జగన్ పాలన**

**జగ్గంపేట:** రాజ్యాంగ స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ప్రత్తిపాడు:** స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

**గోకవరం:** మండల వ్యాప్తంగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఠాణా సెంటర్, అరవపేటలోని అంబేడ్కర్ విగ్రహాలకు ఎస్సీసెల్ మండల కన్వీనర్ బిజ్జి రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, దళిత నాయకులు మచ్చా మోహన్, గోలి చిన్ని, మందపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### కన్నులపండువగా తెప్పోత్సవం



రామలింగేశ్వరస్వామి తెప్పోత్సవం

**తొండంగి:** స్థానిక రామలింగేశ్వరస్వామివారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి కన్నులపండువగా జరిగింది. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలాతోరణం నిర్వహించారు. రాత్రికి కోనేరులో హంసవాహనంపై స్వామి, అమ్మవార్లు విహరించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి తెప్పోత్సవాన్ని తిలకించారు.